పారిశుద్ధ్యంపై పట్టింపేది?

- చిన్నపాటి వర్షాలకే చిత్తడిగా మారుతున్న రోడ్లు
- అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీ వ్యవస్థ
- వీధి దీపాలు వెలగక అలుముకుంటున్న అంధకారం


కుదునూరులో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్న రోడ్లు..

చర్ల: ప్రభుత్వ యంత్రాంగం పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై చూపిస్తున్న శ్రద్ధ అభివృద్ధి పనులపై చూపడం లేదు. చిన్నపాటి వర్షాలకే రోడ్లు చిత్తడిగా మారుతుండగా, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు సైతం బురదమయమవుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు వరదమయం అవుమవుతున్నాయి.

అంధకారంలో గ్రామాలు

చర్ల మండలంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు లేక కాలనీలు, గ్రామాలు, శివారు ప్రాంతాలు అంధకారంలో కొట్టిమిట్టాడుతున్నాయి. మండల కేంద్రంలోని పలు కాలనీలతో పాటు, లింగాపురంపాడు, గొంపల్లి, లింగాపురం, కొత్తపల్లి, మొగళ్లపల్లి, చితకుంట, వీరాపురం, సీ కత్తిగూడెం, కొయ్యూరు, సుబ్బంపేట, గొల్లగూడెం, ఉప్పరిగూడెం, గన్నవరం, ఉంజుపల్లి, వద్దిపేట, పూసుగుప్ప, వెంకటచెరువు, గుంపున్నగూడెం, కేశవాపురం, దండుపేట, తేగడ, మేడివాయి, కొత్తగట్ల, కలివేరు, రాజీవ్‌నగర్, చినమిడిసిలేరు, కొత్తూరు, పెదమిడిసిలేరు, తిప్పాపురం, బత్తినపల్లి, చెన్నాపురం, సత్యనారాయణపురం, దానవాయిపేట, బోదనెల్లి, ఎర్రబోరు, కుదునూరు, మామిడిగూడెం, కొండెవాయి తదితర గ్రామాలు, కాలనీల శివారు ప్రాంతాల్లో నెలల తరబడిగా వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో రాత్రి పూట బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో పాములు, తేళ్ల సంచారంతో ప్రాణభయంతో అత్యవసరమైతేనే బయటకు రావాల్సిన పరిస్థితులు నెలకొన్నారు.

అధ్వానంగా పల్లెదారులు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పల్లెదారుల్లో వర్షపు నీరు నిలిచి బురుదమయంగా మారాయి. ఏళ్ల తరబడిగా మరమత్తులు లేకపోవడంతో పెద్ద ఎత్తున ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచి మరింత బురదమయంగా మారాయి. ఈ దార్లలో కనీసం నడక సాగించడం కూడా కష్టంగా మారడంతో జనం నానా పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కాస్తా తగ్గుముఖం పట్టగా ఆ గుంతల్లో స్థానికంగా దొరికే గ్రావెల్ అయినా పోసి గుంతలు పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

పన్నులు వసూలు.. సేవలు నిల్

చర్ల మండలంలో ఉన్న 26 గ్రామ పంచాయతీల్లో ఏటా ఒక్కో గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల రూపేనా సగటున రూ.3 లక్షల మేర పనులు వసూళ్లు అవుతోంది. మార్కెట్ ఆశీలు, జంతువధ, పశువుల సంత, షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు, లైసెన్స్ ఫీజుల పేరిట చర్ల పంచాయతీకి రూ.85 లక్షలు, పెద్దిపల్లి పంచాయతీకి రూ.5 లక్షల చొప్పున ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ పంచాయతీలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమౌతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

గాండ్లగూడెంలో తాగునీటి ఇక్కట్లు


బోరుకు బస్తా కట్టి వదిలేసిన అధికారులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గాండ్లగూడెం గ్రామంలో గడిచిన నెల రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. గ్రామంలోని భూక్యా చంటి ఇంటి వద్ద ఉన్న బోరు మోటారు నెల రోజుల క్రితం కాలిపోయింది. దీంతో ఆ నాటి నుంచి గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. బోరు మోటారు మరమ్మతులకు గురై విషయాన్ని కొంతమంది స్థానికులు ఇన్‌చార్జ్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన కనీసం పట్టించుకోవడం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు వ్యవసాయ బోర్లు, చేతి పంపులపై ఆధారపడుతున్నారు. సమస్యపై గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి విజయలక్ష్మిని వివరణ కోసం 'సాక్షి'ఫోన్ ద్వారా సంప్రదించగా, ఆమె స్పందించలేదు. స్థానిక ఎంపీడీఓ అప్పారావును వివరణ కోరగా.. విషయం ఇప్పటిదాకా తన దృష్టికి రాలేదన్నారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత ఉందని, అయినప్పటికీ రిపేరు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటానని అన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న కెచ్చల రంగారావు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీ నుంచి అక్రమంగా చేస్తున్న ఇసుక రవాణాను ఆపాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారావు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన డివిజన్ స్థాయి ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఆగిపోయినప్పటికీ డీసిల్టేషన్ పూడికతీత పేరుతో టీజీఎండీసీ అధికారులు చర్ల మండలంలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. కుదునూరు నుంచి సుబ్బంపేట వరకు ఆరు ర్యాంపులు నడుపుతూ.. 6 నుంచి 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలిస్తున్నారని విమర్శించారు. వేలాది లారీల్లో మితిమీరిన లోడుతో గ్రామాల మధ్యలో రేయి పగులు రవాణా చేస్తుండడంతో చర్ల నుంచి భద్రాచలం రోడ్డు పూర్తిగా ధ్వసమైందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అక్రమ ఇసుక రవాణాలను అరికట్టి రోడ్ల విధ్వంసాన్ని ఆపాడంతో పాటు ఇసుక కాంట్రాక్టర్ల ఆస్తులపై సీబీఐ విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో కెచ్చల కల్పన, దాసరి సాయి, మునిగేలా శివ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూముల స్వాధీనం ఆపాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ దుమ్ముగూడెం మండలం దబ్బనూతల గ్రామంలోని ఆదివాసీ రైతులు సాగు చేసుకుంటున్న భూములను రెవెన్యూ అధికారులు ఆక్రమంగా స్వాధీనం చేసుకునే చర్యలను ఆపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్యను పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న భూములను రెవెన్యూ అధికారులు అభివృద్ధి పేరుతో ఆక్రమించుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వీరయ్య రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సునీల్, సోడి చలపతి, తిరుపతిరావు, లింగయ, నరసింహారావు, నాగరాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ వాగ్దానాలు మోసపూరితం'

పినపాక: మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను ప్రభుత్వం మభ్యపెడుతోందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన సగం మందికి పైగా లబ్ధిదారులకు బిల్లులు అందడం లేదని ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయాణమని చెప్పి బస్సు రేట్లు అమాంతం పెంచడం ప్రజల నడ్డి విరవటమేనని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే బస్సు చార్జీల పెంపును విరమించుకోవాలని లేనిపక్షంలో ప్రజల తరపున పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు పూర్తయ్యేదెప్పుడు?


అసంపూర్తిగా నిలిచిపోయిన పనులతో రహదారిపై లేస్తున్న దుమ్మూధూళి..

అశ్వాపురం: మండల కేంద్రంలోని మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. విస్తరణ పనుల్లో భాగంగా కంకర, డస్ట్ వేసి.. డివైడర్ నిర్మించి పనులు అసంపూర్తిగా నిలివేశారు. నెలలు గడుస్తున్నా విస్తరణ పనులు చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలో రహదారిపై దుమ్ము విపరీతంగా లేస్తోంది. మణుగూరులో సింగరేణి, బీటీపీఎస్ వాహనాలు, ఇసుక లారీలు, బస్సులు, ప్రైవేటు వాహనాలు నిత్యం రహదారిపై వెళుతుండడంతో దుమ్ము కమ్ముకుంటోంది. దీంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు. కనీసం గ్రామ పంచాయతీ అదికారులు ప్రధాన రహదారిపై వాటరింగ్ చేయించాలని విన్నవిస్తున్నారు.

వైద్య శిబిరాలతో మేలు


అన్నపురెడ్డిపల్లి: వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారె

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఆదివారం తొలి అడుగు ఫౌండేషన్, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్య శిబిరాలను పేద ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. తొలుత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

మసీదు ప్రారంభం

ములకలపల్లి: ఆపన్నులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. సీతారంపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీద్-ఏ-ఫైసల్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. మానవులంతా కులమతాలకు అతీతంగా సోదరభావంతో మెలగాలని హితవు పలికారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ .. మానవులు అహింసా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, ఎండి.యూసఫ్, కుర్షిద్ అహ్మద్, పాలకుర్తి సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో సీపీఎందే విజయం'

దుమ్ముగూడెం: స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సీపీఎందే విజయం అని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం గడ్డోరుగడ్డ గ్రామంలో స్థానిక సమస్యలను పరిశీలించిన అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. నిత్యం ప్రజాసమస్యలపై స్పందించే సీపీఎంకు విజయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పొత్తులు గురించి సీపీఎం ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మడకం జోగయ్య, కురసం గోపాల్, మట్ట నరసింహారావు, కుంజా జోగారావు, రాజారావు, మడకం సమ్మయ్య, మిడియం ముత్యాలక్క, మిడియం కనకమ్మ, మిడియం భద్రయ్య, తునికి సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు సదుపాయాలు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకన్న

పినపాక: ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నిమ్మల వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బయ్యారం క్రాస్ రోడ్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆదివాసీ గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో లైట్లు, రోడ్లు, నీళ్ల వంటివి ఏర్పాటు చేసి, రోడ్లు నిర్మించాలని సూచించారు. హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి గత జ్ఞాపకాలు నెమరువేసుకొని ఒకరినొకరు పలకరించుకున్నారు. తమ కష్ట సుఖాలు పంచుకున్నారు. విద్యనేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

'బీసీ బిల్లుపై చిత్తశుద్ధి లేదు'

చంద్రుగొండ: బీసీల రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి విమర్శించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ బిల్లుతో సీఎం రేవంత్ రెడ్డి కులాల మధ్య చిచ్చు పెట్టారని ఆయన ఆరోపించారు. ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ పార్టీ.. తాజాగా బీసీ రిజర్వేషన్ బిల్లు పేరిట ప్రజలతో చెలగాటమాడుతోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నైతికత కోల్పోయిందని, రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు భూపతి రమేష్, రంగా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివమాలధారణ

అశ్వారావుపేటరూరల్: పట్టణ కేంద్రంలోని కోనేరుబజారు శివాలయంలో ఆదివారం భక్తులు శివమాలధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఏసు, రాఘవ ఆధ్వర్యంలో మొత్తం 26 మంది భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం శివమాలను ధరించారు. భక్తులు టీకు నాగు, కంచర్ల హనుమంతరావు, రాధాకృష్ణ, వెంకన్న, కొండ, మారేషు, సుధీర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం, నారాయణపురం గ్రామ శివారులో ఉన్న కట్టమైసమ్మ తల్లి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

మాలమహానాడు నాయకుల సంతాపం

మణుగూరురూరల్: మండలంలోని విప్పలసింగారం గ్రామానికి చెందిన కర్నె పద్మ ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందగా.. మండల మాలమహానాడు నాయకులు పద్మ భౌతికకాయాన్ని సందర్శించి.. పూలమాలతో ఘనంగా నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో వేర్పుల నరేష్, వేర్పుల సురేష్, బూర్గుల సతీష్, బాబీ, రవికుమార్, వెంకట్, పగిడేరు గ్రామపెద్దలు ఉన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ నాయకులు గోగినపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కోయ రంగాపురం గ్రామంలో కంగాల వెంకటేష్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓటుకు నోటు తీసుకోవద్దని అన్నారు. నిజాయితీగా పాలన అందించే వారినే స్థానిక సంస్థల్లో గెలిపించాలని సూచించారు. సమావేశంలో జిల్లా నాయకులు కంగాల కల్లయ్య, మాజీ ఎంపీటీసీ వాసం బుచ్చిరాజు, పూసం శారద, బంధం సత్తిరాజు, సోడెం కన్నారావు పాల్గొన్నారు.

గాడి తప్పిన పోలీస్ స్టేషన్


మణుగూరు పోలీస్ స్టేషన్.

మణుగూరురూరల్: కేసుల విచారణలో, గంజాయి రవాణా కట్టడిలో ముందుండే మణుగూరు పోలీస్‌స్టేషన్‌కు జిల్లాలో మంచి పేరుంది. ప్రస్తుతం కొందరి తీరుతో అవినీతి ఆరోపణలతో ఆ స్టేషన్ ప్రతిష్ఠ మసకబారుతోంది.

నేతల ఒత్తిడి, అండతో చిన్న పనికి చేయి చాపి గుడ్డి నమ్మకంతో పోలీసులు ఏసీబీకి పట్టుబడుతున్నారు. తీవ్రమైన నేతల ఒత్తిడితో భూ వివాదాలలో తలదూర్చడం, బెదిరింపులకు పాల్పడటం, రైజింగ్ ఇసుక కాంట్రాక్టర్లకు వత్తాసు పలకడం వంటివి మొదటి నుంచి ఉంటున్నప్పటికీ.. ప్రస్తుతం వాటి పరిధి దాటిపోవడం ప్రజల్లో చైతన్యం అధికమవడంతో అధికారులు ఏసీబీ వలల్లో చిక్కుకుంటున్నారు. ఆరు నెలలుగా మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఇదే జరుగుతోంది. ఒక సీఐ, ఎస్ఐ ఏసీబీ వలలో చిక్కుకుపోవడం అదే సమయంలో మరికొందరు సిబ్బంది పేర్లు ప్రచారం జరగడం విస్మయానికి గురి చేసింది. తాజాగా గంటా రమేశ్ అనే బినామీ ఇసుక కాంట్రాక్టర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగబాబు ఎదుటే ఓ వ్యక్తిపై దాడికి పాల్పడటం, దీనిపై తర్వాత రోజు కేసు నమోదు చేయడం నేతల అండదండల పుణ్యమేనని తెలుస్తోంది. ప్రస్తుతం మరో కేసులో కొందరు బాధితులు కానిస్టేబుళ్లకు రూ.3 వేలు లంచంగా ఇచ్చాం.. ఏసీబీకి ఫిర్యాదు చేశామంటూ సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఇది ప్రచారమైంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మణుగూరు పోలీస్‌స్టేషన్‌పై దృష్టి సారించి గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?


సీపీఐ ఆధ్వర్యంలో నర్సాపురంలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: మీతి మీరిన ఇసుక లారీలతో ఈ ప్రాంత ప్రజలు ప్రాణాలు పోతున్నప్పటికీ పాలకులు, అధికారులకు ఏమీ పట్టాదా అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రావులపల్లి రవికుమార్ మండల కార్యదర్శి బొల్లోజు వేణులు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం నరసాపురం గ్రామ ప్రధాన రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఇసుక రవాణా వల్ల లారీలు బీభత్సంతో రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయని, దీంతో భద్రాచలం, వెంకటాపురం ప్రయాణం అంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రజలు వెళ్లేటువంటి పరిస్థితి నెలకొందని అన్నారు.అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లే వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న సీఐ వెంకటప్పయ్య ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో మాట్లాడి ఇసుక లారీలు ఇటువైపు రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు తాటిపూడి రమేష్, కాకా వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ కిలిమి ఎల్లారెడ్డి, చప్పిడి రాంచంద్రర్ రావు, అమరావది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల ఆధ్వర్యంలో..

భద్రాచలం, చర్ల ప్రధాన రహదారిపై సీతారాంపురం గ్రామంలో గ్రామస్తులు బైఠాయించి వందల ఇసుక లారీల వల్ల ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ధ్వంసం మైన రోడ్లను పునర్నిర్మించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు అన్నె సత్యనారయణమూర్తి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావుతో చరవాణిలో మాట్లాడి ఇసుక లారీలను నియంత్రించాలని, రాత్రిపూట ఇసుక లారీలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అలాగే ఆంధ్ర అధికారులతో మాట్లాడి కన్నాయిగూడెం నుంచి భద్రాచలం వరకు రహదారి మరమ్మతు చేయించాలని కోరారు. దాంతో పాటు మండలంలోని రహదారులను మరమ్మత్తు చేయించాలని కోరారు. కార్యక్రమంలో సాగర్, వెంకట కృష్ణ, బొల్లోజు రవి, బొల్లోజు పవన్, అజీమ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై ముగిసిన వారోత్సవాలు


షుగర్, బీపీ పరీక్షలు చేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

మణుగూరురూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తెలంగాణ చౌరస్తా ప్రాంతంలో అవగాహన కార్యక్రమం చేపట్టడంతో పాటు శ్రీదేవి మెడికల్ షాప్ వద్ద ఉచిత బీపీషుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు షేక్ మీరాహుస్సేన్ మాట్లాడుతూ.. గత వారం రోజులుగా హమాలీలకు, పారిశుద్ధ్య కార్మికులకు, ఉద్యోగులకు మానసిక ఒత్తిడిని అధిగమించడంపై, ఆరోగ్య జీవనంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతానికి సహకరించిన డాక్టర్ శశిధర్‌కు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్‌పర్సన్ ముత్తంశెట్టి నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ డాక్టర్ దుస్సా సమ్మయ్య, దండ రాధాకృష్ణ, చింతపల్లి రాంబాబు, గాజుల పూర్ణచందర్‌రావు, గాజుల రమేష్‌కుమార్, కముజు చంద్రమోహన్, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోశాధికారి అడబాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణమా.. మురుగు కేంద్రమా?


క్రీడా ప్రాంగణంలో ఉన్న మురుగునీటి గుంత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని దిబ్బగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోగల గాడ్రాల గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణ మైదానం మురుగు కేంద్రంగా మారింది. గ్రామీణ క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన ఈ క్రీడా మైదానం అంతా పిచ్చి మొక్కలతో నిండిపోగా, మురుగు, వర్షం నీళ్లతో అధ్వానంగా ఉంది. దీంతో ఇది క్రీడా ప్రాంగణమా? లేక మురుగు నీటికి కేంద్రమా? అని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తక్షణమే శుభ్రం చేయించి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాగు ఇసుకను తోడేస్తున్నారు..

- అర్ధరాత్రి వేళ యథేచ్ఛగా సాగుతున్న దందా
- తప్పించుకునేందుకు నిఘా ఏర్పాటు

ములకలపల్లి: మండలపరిధిలోని సీతారాంపురం శివారులోని ముర్రేడు వాగు ఇసుకను అడ్డగోలుగా తోడేస్తున్నారు. అర్ధరాత్రి వేళ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో పాల్పంచతోపాటు, సమీప ప్రాంతాలకు తరలిస్తున్నారు. అడ్డూ అదుపూ లేకుండా ఈ దందా సాగుతున్నా, అధికారులులెవరూ కన్నెత్తిచూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీతారాంపురం కాలనీ సమీపం నుంచి వాగు వరకూ ప్రత్యేకంగా రోడ్డే నిర్మించుకున్నారు. పొలాల్లోకి వెళ్లే రహదారిని ట్రాక్టర్లు వాగులోకి వెళ్లేందుకు వీలుగా సిద్ధం చేసుకున్నారు. ప్రతీరోజూ ముప్పెకిపైగా ట్రాక్టర్లతో అర్ధరాత్రి నుంచి తెల్లవారే వరకూ తోలకాలు సాగిస్తున్నారు. ప్రత్యేకంగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకొని, సునాయాసంగా పనిని కానిచ్చేస్తున్నారు. గ్రామశివార్లలో, ప్రధాన కూడళ్లలో వేగులను నియమించి, గుట్టుచప్పుడుకాకుండా దందా కొనసాగిస్తున్నారు.

నేరుగా వాగులోకి వెళ్లి..

ఇప్పటికే వాగులోని వేలాది ట్రాక్టర్ టిప్పుల ఇసుక మాయమైంది. వాగులో ర్యాంప్ ఏర్పాటు చేసుకొని, సరాసరి ఇసుక రాశుల వద్దకు వెళ్లి, లోడింగ్ చేసుకుంటున్నారు. అటుపిమ్మట దూరప్రాంతాలకు తరలించి, విక్రయాలకు పాల్పడుతున్నారు. ఇదిలాండగా, తమకు అనువైన ప్రాంతాల్లో భారీగా నిల్వ చేసి, టిప్పర్ లారీల్లో ఖమ్మం, హైదరాబాద్ తదితర పట్టణాలకు తరలిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇకనైనా అధికారులు దృష్టి సారించి, అక్రమ తోలకాలపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.


ముర్రేడు వాగులోని ఇసుకను తోడేసిన ఆనవాళ్లు..


ట్రాక్టర్లు వాగులోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న దారి..